సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



కార్తికేయ.. నమో నమః

పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.

9లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ. 20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.8°/18.4°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. తుపాను ప్రభావంతో వగలంతా ఆకాశం మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వాయువ్యం దిశగా 8-10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

2.60 లక్షల పింఛన్ల పంపిణీ



కొట్లపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమలత

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ కొనసాగుతోంది. ఆదివారం నాటికి 2,60,893 మందికి అందజేశారు. మొత్తం రూ.72,50,34,250 నగదు లబ్ధిదారులకు అందిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. మరో రెండు రోజులు పింఛన్ పంపిణీ చేస్తామన్నారు.

6న వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి వద్దనున్న జిల్లా జైలులో ఈ నెల 6వ తేదీన వేరుశనగ చెక్క వేలం పాట నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రెహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జైల్లో ప్రాంతీయ జైళ్లశాఖ ఉప శాఖాధికారి సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటలకు 25 వేల కేజీల వేరుశనగ చెక్క వేలం వేస్తారని, పాల్గొనదలచిన వారు రూ.22వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కు చెల్లిస్తామని తెలిపారు.

'స్పెషల్ క్యాంపెయిన్'కు విశేష స్పందన



పుట్టపర్తిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 'స్పెషల్ క్యాంపెయిన్ల'కు విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎన్నికల అధికారి మైనుద్దీన్ తెలిపారు. 1,561 పోలింగ్ కేంద్రాల్లో 5,820 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. నూతన ఓటరుగా నమోదుకు సంబంధించి ఫారం-6 దరఖాస్తులు 3,520, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఫారం-7 దరఖాస్తులు 1,029 అందగా, అడ్రస్ మార్పు కోసం 1,271 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఎల్ఓలు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. ఇప్పటికే 2,442 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు వెల్లడించారు.

'సెబ్' దూకుడు



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్ చూపుతున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో 'సెబ్' దూకుడు కొనసాగుతోంది. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పుట్టపర్తి, హిందూపురం, మడకశిర సెబ్‌స్టేషన్ల పరిధిలో అధికారులు దాడులు నిర్వహించారు. 16 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకుని 4 ట్రాక్టర్లు సీజ్ చేశారు. తూముకుంట చెక్‌పోస్టులో 100, హిందూపురంలో 139, మడకశిరలో 26 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

నేపాల్‌లో మరో మూడు తాగునీటి ప్రాజెక్టులు



భూమి పూజ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేపాల్ దేశంలో మరో మూడు తాగునీటి సరఫరా ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. నేపాల్‌కు చెందిన సత్యసాయి సేవా సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఆదివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమిష్ పాండ్యా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమిష్ పాండ్య మాట్లాడుతూ నేపాల్‌లో 11 పాఠశాలల్లోని 4 వేల మంది విద్యార్థులకు తాగునీరు అందించేందుకు ఇప్పటికే 8 సామూహిక నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతుకు తిరుగులేని హక్కు

- మూడు కేటగిరీల్లో భూ యాజమాన్య హక్కులు
- ఏళ్ల కష్టాలు తీర్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ ఇచ్చిన భూములు	1,83,101 ఎకరాలు
భూములపై సంపూర్ణ హక్కులు పొందిన రైతులు	94,572 మంది
ఇనాం భూములు	5,636 ఎకరాలు
పొందిన రైతులు	4,328 మంది



పెదపల్లి సమీపంలో రైతు రాజారెడ్డి అసైన్‌మెంట్ భూమి

పుట్టపర్తి అర్బన్: గతంలో ప్రభుత్వాలు పలు మార్లు పేద కుటుంబాలకు భూముల్ని పంపిణీ చేశాయి. అసైన్‌మెంట్ కమిటీలో అనుమతులు ఇచ్చి అప్పగించారు తప్ప వాటిపై ఎలాంటి హక్కులు కల్పించలేదు. క్రయ విక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, వారసులకు ఇవ్వడానికి వీలు లేకుండా చేశారు. అలాంటి రైతుల కష్టాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. భూములపై సంపూర్ణ హక్కులు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో 94,572 మంది రైతులు 1,83,101 ఎకరాలపై హక్కులు పొందనున్నారు. త్వరలో పట్టాలు పంపిణీ చేయనున్నారు.

ఇనాం భూములూ...

పూర్వం నిరుపేదలైన చాకలి, నాయీబ్రాహ్మణ, కుమ్మరి తదితర కులస్తులకు ఇనాం భూములు కేటాయించారు. గత ప్రభుత్వం ఆ భూములన్నింటిని 22-ఏ (నిషేధిత) జాబితాలో చేర్చింది. అలాంటి వారికి కూడా న్యాయం చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 4,328 మంది రైతులకు 5,636 ఎకరాలపై సంపూర్ణ హక్కులు లభించనున్నాయి.

ఎస్సీ,ఎస్టీలకు శ్మశాన వాటికలు.. పేదలకు ఇళ్ల స్థలాలు

అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా నివసించే గ్రామాలకు శ్మశానవాటికలు చూపి ఇబ్బందులు తొలగించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జిల్లాలో చాలాచోట్ల ఎస్సీ, ఎస్టీలకు శ్మశానవాటికలు లేవు. స్థలం చూపాలని చాలా సందర్భాల్లో రోడ్డెక్కినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ విషయాలను గుర్తించిన సీఎం జగన్ సర్కారు పలు గ్రామాల్లో శ్మశాన వాటికల కోసం స్థలాలు కేటాయించింది. జిల్లాలోని 144 ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 168 ఎకరాలు కేటాయించారు. ఇక.. నిరుపేదలకు స్థలం ఇచ్చి ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోంది. పట్టణాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్ల స్థలం కేటాయించారు. జిల్లాలో ఏకంగా 300 కాలనీలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం 1,130 ఎకరాలు కొనుగోలు చేసి పేదలకు పట్టాలు అందించడం గమనార్హం.

ఇబ్బందులు తొలగించారు



20 ఏళ్లకు ముందు ప్రభుత్వం 3.17 ఎకరాలు పంపిణీ చేసింది. ఇప్పటి వరకూ దానిపై ఎలాంటి హక్కులు లేక ఇబ్బందులు పడ్డా. ఇటీవల నిషేధిత జాబితా నుంచి తొలగించి సంపూర్ణ హక్కులు కల్పించారు. ఇకపై నా భూమిని వారసులకు హక్కుగా ఇవ్వొచ్చు. బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చు.

– రాజారెడ్డి, పెదపల్లి, పుట్టపర్తి మండలం

శ్మశాన వాటికకు స్థలం



శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇటీవల ప్రభుత్వం గ్రామ సమీపంలోని కొంత భూమిని సర్వే చేసి కేటాయించడంతో కాలనీ వాసులు సంతోషించారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. ముఖ్యమంత్రి ఏ పథకాన్ని ప్రారంభించినా పేదలకు న్యాయం జరుగుతోంది.

– రమేష్‌బాబు, బైరాపురం, కొత్తచెరువు మండలం:

పారదర్శకంగా అమలు



భూ సంస్కరణలను గతంలో ఏ ప్రభుత్వమూ పారదర్శకంగా అమలు చేయలేదు. సీఎం జగన్ రెవెన్యూ శాఖలో కీలక మార్పులు తీసుకొచ్చారు. భూముల రీ సర్వే చరిత్రాత్మకం. 20 ఏళ్ల క్రితం ఇచ్చిన అసైన్‌మెంట్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– అరుణ్‌బాబు, కలెక్టర్

10 మండలాల్లో వర్షం

- మరో మూడు రోజులు వానలు
- 'స్పందన' రద్దు



పుట్టపర్తి సమీపంలో కల్లంలో వడ్ల రాశులను కప్పి ఉంచిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ జిల్లాలోని 10 మండలాల్లో వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఓడీ చెరువు మండలంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎన్‌పీ కుంట మండలంలో 4 మిమీ, నల్లచెరువు-3.2,తలుపుల, తనకల్లు- 2.4,గాండ్లపెంట,ముదిగుబ్బ- 2, పుట్టపర్తి- 1.6, బుక్కపట్నం , కొత్తచెరువు- 1.4 మి.మీ మేర వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో సోమవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

వానల నేపథ్యంలో నదులు, వంకలు, పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు తలెత్తితే పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 08885-292432కు ఫోన్ చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. తుపాన్ నేపథ్యంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు ఫిర్యాదులు సమర్పించడానికి జిల్లా కేంద్రానికి రావొద్దని సూచించారు.

రైతన్నలూ.. జాగ్రత్త

జిల్లాకు వర్షసూచన నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. వరి కోతలు ఆపాలన్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసి ఉంటే, పంట ఉత్పత్తులకు పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచాలన్నారు. కూరగాయలు, ఆకు కూరల తోటల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్, పీజీటీ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) పోస్టులు, 15 పీజీటీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇటీవల రిక్రూట్‌మెంట్ చేసిన సమయంలో తయారు చేసిన 1:3 మెరిట్ జాబితాలోని రెండో అభ్యర్థికి అవకాశం కల్పించారు. వివిధ రోస్టర్లలో అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీగానే ఉంచారు. సమగ్రశిక్ష ఏపీసీ జాలుకుంట వరప్రసాదరావు ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 37 పోస్టులకు గాను 17 పోస్టులను భర్తీ చేశారు. సీనియార్టీ ప్రకారం ఆయా ఖాళీలను భర్తీ చేశారు. ఏపీసీ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. సోమవారం విధుల్లో చేరాలని ఆదేశించారు. కాగా తక్కిన పోస్టులను 1:3 జాబితాలోని మూడో అభ్యర్థితో రోస్టర్‌ను అనుసరించి సోమవారం భర్తీ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో గుత్తి డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్తీ అయిన పోస్టులు ఇవే...

ఆదివారం నాటి కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ పోస్టులు 2, పీజీటీ బాటనీ 1. పీజీటీ కెమిస్ట్రీ 1, పీజీటీ సివిక్స్ 2, పీజీటీ ఎకనామిక్స్ 3, పీజీటీ ఇంగ్లిష్ 2, పీజీటీ మ్యాథ్స్ 2, పీజీటీ ఫిజిక్స్ 2, పీజీటీ జువాలజీ 2 పోస్టులు భర్తీ చేశారు.

టీడీపీలో టికెట్ల లొల్లి!

- తమ నాయకుడికే అంటూ ఎవరికి వారు డాంబికాలు
- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- జనసేనతో కొత్త తలనొప్పి
- పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండల్లో మాటల యుద్ధం



సాక్షి, పుట్టపర్తి: టీడీపీలో రోజురోజుకూ అసమ్మతి జ్వాలలు పెరిగిపోతున్నాయి. 'తమ్ముళ్లు' సామాజిక మాధ్యమాల వేదికగా చెలరేగిపోతున్నారు. ఒక వర్గంపై మరొక వర్గం వారు మాటల యుద్ధం చేస్తున్నారు. టికెట్ తమ నాయకుడంటే, తమ నాయకుడికంటూ పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. ఇదే సమయంలో జనసేన కార్యకర్తలు కూడా తమ వారికే సీటు అని చెబుతుండడంతో కిందిస్థాయి కేడర్ అయోమయంలో పడింది. ఎన్నో ఏళ్లుగా టీడీపీలో ఉన్న కార్యకర్తలకు ఏ నాయకుడి వెంట నడవాలనే దానిపై స్పష్టత లేక ఇంటికే పరిమితమవుతున్నారు. మరికొందరు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. రెండు నెలల్లోనే జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వందల కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకోవడమే దీనికి నిదర్శనం.

ముఖ్యనేతల మౌనం..

పుట్టపర్తి టికెట్ వడ్డే వెంకట్‌కు ఖరారు అయిందని భారీగా ప్రచారం జరుగుతోంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పల్లె రఘునాథరెడ్డి నోరెత్తడం లేదు. పెనుకొండ టికెట్ సవితమ్మకు దాదాపు ఖాయమైందని ఆమె అనుచర వర్గం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తుండగా.. ధర్మవరం టికెట్ పరిటాల శ్రీరామ్‌కు రాదని, గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి) త్వరలోనే టీడీపీ తీర్థం పుచ్చుకుని సైకిల్ గుర్తుపై పోటీ చేస్తారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే, టీడీపీతో పొత్తు ఖరారు అయిందని పుట్టపర్తి, ధర్మవరం సీట్లను జనసేనకు కేటాయిస్తారని ఆ పార్టీ కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో టీడీపీ - జనసేన కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడింది. ఇటీవల పుట్టపర్తిలో జరిగిన ఇరు పార్టీల సమన్వయ సమావేశం అటర్ ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే.

తలలు పట్టుకుంటున్న ఇన్‌చార్జ్‌లు

ఒకవైపు సొంతపార్టీలోనే వర్గపోరు పెరిగిపోవడం, మరోవైపు జనసేన కార్యకర్తలు సామాజిక మాధ్యమాల వేదికగా చేస్తున్న ప్రచారాలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి. ఏ విధంగా స్పందించినా సమస్య వస్తుందని మౌనం పాటిస్తున్నారు. ఫలితంగా టీడీపీ కార్యకర్తలు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తమకు ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతోనే తమ దారి తాము చూసుకుంటున్నామని చెబుతున్నారు. పెరిగిపోతున్న అసమ్మతి కారణంగా టీడీపీ గెలవడం కష్టమని, అందుకే ముందుగానే అప్రమత్తమవుతున్నామని పలువురు చెప్పారు.

టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం



మడకశిరలో వైఎస్సార్ సర్కిల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు శంకర నారాయణ, తిప్పేస్వామి, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ తదితరులు

- బీసీలను వాడుకుని వదిలేసిన చంద్రబాబు
- మడకశిరలో 7న సామాజిక సాధికార బస్సుయాత్ర
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ

మడకశిర: టీడీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకర నారాయణ విమర్శించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక సామాజిక న్యాయం సాకారం చేశారని కొనియాడారు. ఈ నెల 7న మడకశిరలో సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనున్న వైఎస్సార్ సర్కిల్ ప్రాంతాన్ని ఆదివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బీసీలకు గౌరవం పెరిగిందన్నారు. అధికంగా పదవులు ఇచ్చిన ఘనత ఆయనదేనని తెలిపారు. మంత్రి వర్గంలోనే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేయడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సుయాత్రలకు జనం బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. మడకశిరలో బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సైనికుల్లా సాగుదామని పిలుపునిచ్చారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి రక్ష.. మృగాలకు శిక్ష

- కామాంధులకు కళ్లెమేస్తోన్న 'పోక్సో'
- రెండు నెలల్లో నలుగురు జైలుపాలు
- బాధితులకు పరిహారంతో చేయూత



- బుక్కపట్నం గ్రామానికి ఓ వివాహిత తన కుమార్తెను ఇంటి దగ్గరలో ఉన్న దుకాణానికి పంపింది. అదే గ్రామానికి బెస్త మహేష్ బాలిక చేయిపట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు పెట్టడంతో భయంతో ఉడాయించాడు. బుక్కపట్నం ఎస్ఐగా పనిచేసిన మహేంద్రభూపతి దీనిపై కేసు నమోదు చేశారు. సత్వర విచారణ చేపట్టి ఇటీవల కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అభియోగాలు రుజువు కావడంతో నిందితుడికి పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ. 5 వే జరిమాన విధించింది. బాధితురాలికి రూ. లక్ష నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది.
- కదిరికి చెందిన తలుపులు బాబ్జాన్ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి భార్య ఇంట్లో లేని సమయాల్లో 14 ఏళ్ల కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. పాఠశాలలో ఓ రోజు బాలిక కళ్లు తిరిగి పడిపోయింది. ఉపాధ్యాయులు పరీక్షలు చేయించగా గర్భిణి అని తేలింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వేగంగా విచారణ చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడికి జీవిత కాల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా పడేలా చేశారు. బాధితులకు రూ. 4 లక్షల పరిహారం అందించారు.

పుట్టపర్తి టౌన్: ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం కామాంధుల పాలిట సింహస్వప్నంగా మారింది. మానవ మృగాలకు కళ్లెం వేస్తోంది. అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించడం లేదు. 18 ఏళ్లలోపు బాలబాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినా, అత్యాచారం చేసినా కఠిన శిక్షలు పడుతున్నాయి. కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులు వేగం పెంచడం, న్యాయవాదులు అభియోగాలు రుజువు చేయడంతో కచ్చితంగా జైలు శిక్ష పడుతోంది. దీంతో కేసుల్లో సత్వర న్యాయం వీలు పడుతోంది.

పరిహారంతో చేయూత..

ముద్దాయిలను చట్ట పరంగా శిక్ష విధించడమే కాకుండా బాధితులకు పరిహారం అందించి కొంతైనా సాంత్వన చేకూర్చేలా 'పోక్సో' చట్టానికి రూపకల్పన చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే వాస్తవాలు పరిశీలించి వేగవంతంగా చార్జ్‌షీట్ దాఖలు చేసేలా జిల్లా ఎస్పీ మాధవరెడ్డి చొరవ చూపుతుండడం, కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విద్యాపతి ప్రభావవంతంగా వాదనలు వినిపిస్తుండడంతో కామాంధులు తప్పించుకోలేకపోతున్నారు. కోర్టులో కేసు విచారణ, పరిహారం వీలైనంత త్వరగా విడుదల చేయడంలో పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి కూడా ప్రత్యేక చొరవ చూపడం తో బాధితులకు ఊరట దక్కుతోంది. భయాందోళనకు గురికాకుండా కోర్టును ఆశ్రయిస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతోంది.

నేరగాళ్లు తప్పించుకోలేరు



తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు. కచ్చితంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నాం . జిల్లా ఏర్పడినప్పటి నుంచి నాలుగు పోక్సో కేసులు, 3 ఇతర కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడేలా చేశాం. న్యాయ, పోలీసు వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కొంతమంది బాధితులు భయంతో ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఆందోళన చెందకుండా పోలీసులను ఆశ్రయించాలని కోరుతున్నా.

– మాధవరెడ్డి, ఎస్పీ

రథోత్సవం.. నయన మనోహరం



రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

హిందూపురం: పట్టణంలో ఆదివారం గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం నయన మనోహరంగా సాగింది. ఆలయ అర్చకులు గోవింద శర్మ ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, పుష్ప, తులసీ పత్రాలతో అర్చన చేశారు. బంగారు కవచం, విశేష పుష్పాలతో ముస్తాబు చేసి వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీపై కొలువుదీర్చారు. మేళతాళాలతో ప్రాకారోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. భక్తులు రథంపై పూలు, అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రంగనాథ స్వామి గోవిందా.. గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయం వద్ద ఉత్సవ మూర్తులకు హారతులిచ్చి భక్తుల దర్శనార్థం ఉంచిన అనంతరం స్వామికి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ నాగేంద్ర, పట్టణ ప్రముఖులు కట్ల వెంకటేష్, నరసింహులు, శ్రీనివాసరెడ్డి, జేపీకే రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



రంగనాథునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

కుంటలో పడి మహిళ మృతి

పరిగి: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం గణపతిపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన కదిరప్ప భార్య తిమ్మక్క (50) ఆదివారం ఉదయం బహిర్భూమికని నీటి కుంట వద్దకెళ్లింది. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో అదుపు తప్పి కుంటలో పడిన ఆమె నీట మునిగి ఊపిరి అందక మృతి చెందింది. అటుగా వెళ్లిన వారు కుంటలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, ఏఎస్‌ఐ జయలత, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని బాలుడి మృతి



మృతుడు పార్థీన్

హిందూపురం అర్బన్: రైలు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు... హిందూపురంలోని రహమత్‌పుర నివాసి పార్థీన్ (16) ఆదివారం ఉదయం బంధువులను రైలు ఎక్కించేందుకు హిందూపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. వినికిడి లోపంతో బాధపడుతున్న పార్థీన్ హెడ్ ఫోన్స్ పెట్టుకుని గుడ్డం ప్రాంతం వరకూ పట్టాలను అనుసరిస్తూ వెళ్లి తిరిగి ప్లాట్‌ఫాం వద్దకు వస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కేకే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఘటనలో అక్కడికక్కడే పార్థీన్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫారూక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శెట్టిపి



జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. హిందూపురంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ఎంపిక జరిగింది. ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

పెనుకొండ రూరల్: పోక్సో కేసులో పట్టుబడిన వ్యక్తిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. వివరాలను ఆదివారం రాత్రి ఆయన వెల్లడించారు. మూడు నెలల క్రితం పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో బాలిక కర్ణాటకలోని నెలమంగలలో ఉన్నట్లుగా గుర్తించి అక్కడికెళ్లి పిలుచుకొచ్చారు. కర్ణాటకకు చెందిన కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కిరణ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

కార్తికేయ నమో నమః



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు







ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) స్వామి బంగారు కవచంతో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- భక్తులతో కిటకిటలాడిన పంపనూరు
- దర్శనానికి గంటల సమయం

ఆత్మకూరు: కార్తీక మాసం బహుళ షష్టిని పురస్కరించుకుని ఆదివారం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తికేయుడు నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి దర్శనానికి గంటల సమయం పట్టింది. కుంకుమార్చనలు, పాలాభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. తులసీదామోదర కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆకు పూజ, స్వరణ కవచ సేవ, మహా మంగళ హారతి తదితర పూజాదికాలను అర్చకులు రాము, సాయి తదితరులు వైభవంగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మంజునాథ స్వామి, పార్వతీ దేవి ఉప ఆలయాల్లో విశేష అలంకరణలు, పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించేందుకు మహిళలు పోటీ పడ్డారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ అక్కిరెడ్డి పర్యవేక్షించారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి..

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రాన్ని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ, కుమార్తె ఇందిరాప్రియ సందర్శించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి బంగారు కవచంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గో పూజలో పాల్గొని ఆహారం అందించారు.

అనంతరం రాత్రి కోటి దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎస్కే యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు తోపుదుర్తి నయనతారెడ్డి పాల్గొని జ్వాలా తోరణాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, సర్పంచ్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఏకమవుదాం





భోజనాలు వడ్డిస్తున్న మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్
- ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం
- తరలివచ్చిన బలిజ కులస్తులు

అనంతపురం టవర్‌క్లాక్: ఐక్యతతోనే ఏదైనా సాధ్యమవుతుందని, ఈ నేపథ్యంలో బలిజలందరూ హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి రావాలని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని అశ్వత్థనారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం రాయలసీమ బలిజ మహాసభ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి బలిజలు తరలివచ్చారు. రాయలసీమ బలిజ మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాజుల పద్మజ ఆధ్వర్యంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మహా శివుడికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు సోములదొడ్డి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఊరేగింపుగా అశ్వత్థనారాయణ స్వామి ఆలయ ప్రాంగణానికి చేర్చి పూజలు నిర్వహించారు.

అనంతరం మహాలక్ష్మి శ్రీనివాస్, గాజుల పద్మజ, టౌన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాయలసీమ బలిజ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు పాములరాయి వెంకటేశ్వర్లు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న బలిజలు రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమవుదామంటూ పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బలిజ మహాసభ గౌరవాధ్యక్షుడు బళ్లారి వెంకట్రాముడు, మహిళా సభ్యులు నిత్యభారతి, గౌరీతిలోత్తమ, శంకరమ్మ, నీరజాదేవి, కృష్ణవేణి, రాజేశ్వరి, మల్లేశ్వరి, పద్మ, దీప, ఈశ్వరమ్మ, కాయగూరల లక్ష్మీపతి, కొండవీటి భావన, రాయల్ మురళి, రవికాంత్ రమణ, పావురాల శేఖర్, నాగభూషణం, సాయి భాస్కర్, రాయల్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి పడి బాలిక మృతి



ఆలియా మృతదేహం

గుత్తి రూరల్: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి ఓ బాలిక మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లి నివాసి మహమ్మద్ బాషా కుటుంబంతో కలసి గుత్తికి వలస వచ్చి గాంధీనగర్‌లో స్థిరపడ్డాడు. ఆటో నడపడంతో పాటు బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య కుళ్లాయమ్మ, కుమార్తె ఆలియా (8)తో కలసి ప్రతి ఆదివారం స్వగ్రామానికి వెళ్లి తల్లి వద్ద గడిపి తిరిగి వచ్చేవారు. ఈ క్రమంలో ఈ నెల 3న కుటుంబసభ్యులతో కలసి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరిన మహమ్మద్ బాషా ఆటో నడుపుతుండగా పక్కనే కూర్చొన్న ఆలియా మామిళ్లచెరువు శివారులోకి చేరుకోగానే అదుపు తప్పి కిందపడి గాయపడింది. అదే ఆటోలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు చేర్చారు. తలకు బలమైన గాయం కావడంతో అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్ జగన్‌కు అండగా నిలుద్దాం

- 98 ఎంటీఎస్ టీచర్ల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పాతికేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న డీఎస్సీ-98 అభ్యర్థుల సమస్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రాబోవు ఎన్నికల్లో గెలిపించాలని వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్‌లో ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లా 98 ఎంటీఎస్ టీచర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఎంటీఎస్ టీచర్ల కుటుంబాలన్నీ మద్దతుగా నిలవాలని కోరారు. 98 ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో 98 ఎంటీఎస్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్తాల బాలిరెడ్డి, రాష్ట్ర న్యాయ సలహాదారు కృష్ణ రంగారెడ్డి, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు చింతా రామకృష్ణ, ఉమ్మడి అనంత జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆర్.రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు, గౌరవ సలహాదారులు చెన్నకేశవులు, టి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



జవాన్ క్రాంతికిరణ్‌కు వందన సమర్పణ గావిస్తున్న సైనికులు, క్రాంతికిరణ్ (ఫైల్)

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ కురుబ క్రాంతి కిరణ్ (32) మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆరేళ్ల క్రితం అసోంలోని గౌహతిలో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా చేరిన ఆయన శుక్రవారం అక్కడే భార్య హారిణితో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముందు వెళుతున్న కారు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే ఢీకొని మృతి చెందాడు. దీంతో ఆదివారం ఉదయం స్వగ్రామానికి ఆయన మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని కన్నీటి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొని తుది ఘట్టం వరకూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే బ్రాహ్మణుల అభివృద్ధి

- ఏపీబీఎస్ఎస్ అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని బ్రాహ్మణులకు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ సూచించారు. అనంతపురంలోని ఆదర్శనగర్‌లో ఉన్న బెస్తవారి కల్యాణ మంటప ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వన భోజనాలు సందడిగా జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి దుర్గాప్రసాద్‌తో పాటు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి మనోహర్, అధికార ప్రతినిధి నార్పల మారుతి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గాయత్రి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. శాఖా విబేధాలు మాని అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు రుద్రాభిషేకం, అక్షర కోటి గాయత్రి జపం, వేదమంత్రాల నడుమ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతకు విచ్చేసిన రాష్ట్ర నాయకులను, ప్రముఖ రంగస్థల కళాకారుడు వరప్రసాద్‌ను ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేసుల సత్యనారాయణ, పట్నం విశ్వేశ్వరరావు, సీవీ మురళీధర్, కృష్ణమూర్తి, నాట్యాచార్యులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పెనుకొండ రూరల్: స్థానిక జూనియర్ కళాశాలలో 1966–67లో హయ్యర్ సెకండరీ కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు అదే కళాశాల వేదికగా ఆదివారం కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసి పోయారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు నాగరాజరావు, అరుణాచలంను ఘనంగా సత్కరించారు. తమ జ్ఞాపకంగా కళాశాలకు ఓ బీరువాను బహూకరించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు పోతిరెడ్డి, కుళ్లాయప్ప, బి.రామకృష్ణ, శ్రీనివాసులు, లింగారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

యువకుడి ఆత్మహత్య



రమణకుమార్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: అనారోగ్య ఇబ్బందులను తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన రమణకుమార్ (30) కూలి మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతున్న ఆయన ఆదివారం ఉదయం డీఎల్ఆర్ కాలనీ సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. తల్లి శారదమ్మతో కలసి జీవించేవాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనవాక్కు

ప్రాణం పోశారు



మధ్య తరగతి కుటుంబానికి చెందిన నాకు ప్రస్తుతం 60 ఏళ్లు. ఐదేళ్ల క్రితమే నా భర్త మరణించాడు. ప్రభుత్వం నాకు రూ.2,750 పింఛన్ ఇస్తోంది. పిల్లలేమో బెంగళూరులో ఉంటున్నారు. వారం రోజుల క్రితం ఊళ్లో కుక్కలు తరుముకు రావడంతో కిందపడ్డాను. చెయ్యి విరిగింది. కాలుకు గాయాలయ్యాయి. దీంతో హిందూపురంలోని బాలాజీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మా కుమార్తె చేర్పించింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు. ఖర్చు దగ్గర నేను భయపడుతుంటే ధైర్యం చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆస్పత్రిలో నాలుగు రోజులు ఉన్నా.. ఒక్క పైసా కూడా తీసుకోలేదు. ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. ఆపద సమయంలో నా ప్రాణాలను జగన్ ప్రభుత్వం నిలబెట్టింది.

– రత్నమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

సొంతింటి కల నెరవేరింది



గత ప్రభుత్వ హయాంలో సొంతింటి కోసం పలు మార్లు అర్జీలు అందజేసి విఫలమయ్యా. జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నా సొంతింటి కల నెరవేరింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం వేగంగా సాగుతుంది. అలాగే రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందడంతో పంటల సాగుకు అప్పు చేసే భారం తప్పింది. ప్రజలకు మంచి చేసే సీఎం వైఎస్ జగన్ పాలన సదా ఉండాలని కోరుకుంటున్నా.

– కె.వెంకటేష్, వజ్రకరూరు

కౌలు రైతులకు ఊరట



గత ప్రభుత్వ హయాంలో భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తే వరుస పంట నష్టాలతో సతమతమయ్యాయి. కౌలు రైతు కావడంతో పంట నష్ట పరిహారాన్ని అప్పటి ప్రభుత్వం అందించలేదు. ప్రస్తుత జగన్ ప్రభుత్వంలో కౌలు రైతులకు మహర్దశ చేకూరింది. నేను ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా.. ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 లబ్ధి చేకూరింది. ఈ మొత్తంతో పెట్టుబడి లేని వ్యవసాయం చేస్తున్నా. అంతేకాక సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాయి. గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే నేరుగా మా పంటను కొనుగోలు చేసింది. వైఎస్సార్ పింఛన్ సొమ్మును ప్రతి నెలా 1వ తారీఖున వలంటర్ ఇంటి వద్దకే తెచ్చిస్తున్నాడు. నా కుమారుడికి అమ్మ ఒడి పథకం లబ్ధి చేకూరింది. ఇంతకంటే మంచి ఏ ప్రభుత్వమూ చేయదు.

– కె.ప్రభుదాసు, వజ్రకరూరు

ఇంటి వద్దకే సంక్షేమం



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. పేదలకు మంచి చేసే ప్రభుత్వ పాలనలో మేముండడం గర్వంగా భావిస్తున్నాం. సిఫారసులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి చేకూరుస్తున్నారు. నాకు ఏటా 13,500 చొప్పున రైతు భరోసా లబ్ధి చేకూరింది. ఏడో తరగతి చదువుతున్న నా కుమారుడు పేరుతో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు చొప్పున అందుతోంది. మా అమ్మ ఓబులమ్మకు పింఛన్ అందుతోంది. అన్నింటి కంటే ముఖ్యం జగన్ పాలనలో నాలుగేళ్లు మంచి వర్షాలు కురిసి కరువు అనేది లేకుండా పోయింది. ఇలాంటి పాలన కలకాలం ఉండాలని కోరుకుంటున్నా.

– కొత్తపల్లి శ్రీనివాసులు, కొనకొండ్ల, వజ్రకరూరు మండలం

'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం...ఆంధ్రా' క్రీడా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యువతకు మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్త క్రీడాకార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని పెద్ద వేదికకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో ఆసక్తి ఉన్న 15 ఏళ్లు పైబడిన వారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వీరికి సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు నిర్వహించి మొత్తంగా రూ.12 కోట్లకు పైగా బహుమతులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పేర్లను 'ఆడుదాంఆంధ్రా.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నేరుగా లేదా సమీపంలోని సచివాలయంలో కానీ, 1902కు కాల్ చేసి గాని నమోదు చేసుకోవాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SOFTWARE TRANING

■ New Batch : SAP, FICO, RTR, OTC, PTP, CTP and FTP software Training Classes @ ANANTAPUR. Contact : 9985162030. [A-784477]

SSC(GD), రైల్వే, ఆర్మీ, ఉద్యోగాలు

■ 10thపాస్‌తో CRPF, CISF, BSF ఉద్యోగాలు, రైల్వే గ్రూప్-డి, రైల్వే పోలీస్ RPF, ఆర్మీ ఉద్యోగాలకు జాబ్ గ్యారెంటీతో శిక్షణ. స్వల్ప ఫీజు, ఉచిత బుక్స్, హాస్టల్, గ్రౌండ్. సిద్ధార్థ అకాడమీ, నంద్యాల. 90103 63553 [L-781168]

EDUCATION

■ REGULAR/DISTANCE/DISCONTINUED/FAILURES/ DETAINED STUDENTS: ANIMAL HUSBANDRY (DIPLOMA VETERINARY) 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD. Cell: 86861 72989 [L-806261]

REAL ESTATE

PLOT FOR SALE

■ అనంతపురము తపోవనం 73X32 కొలతలు గల 5.36 సెంట్లు పడమర ఫేస్ ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర : సెల్ : 9440851905 [A-1387]

VILLA FOR SALE

■ East Face Villa, 3.17 Cents. Rs. 72 Lakhs @ Gated Community - C.R. Homes, Bellary Road, Anantapur. Phone : 9299992830. [A-784474]

TOLET SHOP ROOM

■ అనంతపురము Rajahamsa Sweet Home (KIA Motors Show Room ప్రక్కన) Flat No. 10, Shop Room Ground Floor, కిరాణా, బ్యూటీ పార్లర్, ఆఫీస్‌లకు బాడుగకు ఇవ్వబడును. సంప్ర : 9849854875 [A-7365]

WANTED

■ అనంతపురములో ప్రముఖ కళాశాల యందు పనిచేయుటకు అనుభవం కల Lady JL in Maths, Physics, Chemistry, English లెక్చరర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9948567527, 9490859421. [A-7364]

■ పర్మినెంట్ గా వర్క్ ఫ్రమ్ హోమ్ కొరకు గృహిణులు, రిటైర్డ్, నిరుద్యోగులు, చిరుద్యోగులు, స్టూడెంట్స్, టీమ్ లీడర్స్ కావలెను. Age:20+, P/F:15K-30K, సెల్:9618775044. [A-1412]

■ తేజ జాబ్ ప్లేస్ మెంట్ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అనంతపురం, బెంగళూరు, HYD నందు MNC కంపెనీల నందు జాబ్స్ కలవు. గమనిక:స్పాట్ జాయినింగ్. 9441977101, 9441185663. [A-1411]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర:: 9177736926. [M-1221930]

■ మీ గ్రామం/మీ మండలంలోనే ఉంటూ My V3 Ads కంపెనిలో వర్క్ చేయడానికి Male/Female కావలెను. సంప్రదించండి. జి.మురళీ. 9030661651 [G-1404]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో Job చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F). Age 18 to 30. నో ఫీజు. సెల్: 9885514518. [WA-7152]

■ ధర్మవరం పట్టణంలో బయోకెమిస్ట్రీ ల్యాబ్ నందు పనిచేయుటకు ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. మరియు లైసెన్స్ కలిగిన ఫార్మాసిస్టు కావలెను. సంప్ర. ఫోన్ : 7702123126 [C-777447]

■ సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 8hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF+ESI సౌకర్యం కలదు. మంచి జీతం బోనస్. అనంతపూర్. Ph: 7013730900/ 9246543129 [H-788102]

■ కంప్యూటర్ ఆపరేటర్స్ (M/FM) అర్జెంటుగా కావలెను. జీతం : 10 వేలు, Q : ఏదైనా డిగ్రీ, # అనంతపురము టౌన్, 1వ రోడ్డు, పొట్టిశ్రీరాములు స్కూల్ దగ్గర, సెల్ : 9848524061. [A-784476]

■ WANTED : అనంతపురంలో మా షాపులో పనిచేయుటకు సేల్స్ బాయ్స్ కావలెను. 10th / Inter / Degree, SALARY : 8000 to 9000 / Month. Contact : 9885900945. [A-7366]

■ బాదర బందీ లేని స్త్రీ / పు వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్స్, వంటవారు, ఫీల్డ్ ఆఫీసర్, ఫ్రీ భోజనం, వసతి, జీ:13-18 వేలు # గోల్డెన్ ఓల్డేజ్ హోమ్ ATP సెల్: 8333081276. [A-784481]

■ జై బాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీ AG&P గ్యాస్ ఏజెన్సీ నందు పనిచేయుటకు ఆర్మీ / BSF లో పనిచేసి రిటైర్డ్ అయిన 55 సంవత్సరాల లోపు వయస్సున్న వారు అర్హులు హిందూపురం-1 రాప్తాడు-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి పనిగంటలు 12 hrs , పని దినాలు 26 రోజులు, జీతం:27,161/- (PF&ESI) ఆసక్తిగల అభ్యర్థులు సంప్రదించండి సెల్:7529998899 [A-784482]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి మహాసమాధి



షంషేర్ ఉత్సవంలో పాల్గొన్న దర్గా పీఠాధిపతులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నేత్రపర్వంగా 'షంషేర్'

జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు స్వామి ఉత్సవాల్లో భాగంగా పర్మాస్ హుస్సేనీ షంషేర్ ఉత్సవం ఆదివారం ఘనంగా సాగింది. ఆదివారం తెల్లవారుజామున గుర్రంపై షంషేర్‌ను భారీ ఊరేగింపు మధ్య దర్గా వద్దకు చేర్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులతో దర్గాహొన్నూరు కిటకిటలాడింది.

బొమ్మనహాళ్: